సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 14 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం | 18.04.2025



## వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో

# పసికందు మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన
- కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వైద్యాధికారి విచారణ
- విచారం వ్యక్తం చేసిన మ్మెల్యే యశస్విని రెడ్డి, మాజీ మంత్రి దయాకర్ రావు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తిలోని స్థానిక ప్రభుత్వ వైద్య శాలలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పసికందు మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టిన సంఘటన కలకలం రేపుతుంది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందారని కుటుంబ సభ్యుల ఆందోళన చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం లక్ష్మీనారాయణ పురానికి చెందిన అర్చన మొదటి కాన్పుకు ప్రసవం కోసం రెండు రోజుల కింద పాలకుర్తి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. సాధారణ ప్రసవం చేస్తామని సిబ్బంది చెప్పి అడ్మిట్ చేసుకున్నారు. కాల యాపన కావడంతో కుటుంబ సభ్యులు అర్చన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని గమనించారు. గట్టిగా నిలదీయడంతో ప్రవేటు వైద్యశాలకు తీసుకెళ్లాలని సిబ్బంది వారికి సూచించారు. కుటుంబ సభ్యులు అర్చనను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడ స్కానింగ్ చేసి శిశువు మృతి చెందిందని నిర్ధారించారు. అనంతరం ప్రసవం చేశారు. పసికందు మిగతాజీవిగా ఉండి గర్భంలోనే మృతి చెందింది. ఆగ్రహం చెందిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి బుధవారం అర్ధరాత్రి వరకు ఆందోళన చేపట్టారు. భాజపా, బారాస నాయకులు వారికి మద్దతు తెలప డంతో ఆందోళన ఉధృతమైంది. పోలీసులు రాత్రంతా బందోబస్తు చేపట్టారు. గురువారం విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు పాలకుర్తి కి వచ్చి విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా



వైద్యాధికారి మల్లికార్జున రావు సమగ్ర విచారణ చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కు నివేదిక అందించారు.

### బోరున విలపించిన కుటుంబ సభ్యులు

మగ శిశువు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు బోరున విలపించారు. ఆస్పత్రి వాతావరణం రోదనలతో మీన్నంటిది. ఈ విషయంపై ఆరా తీసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి దయాకర్ రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియ జేశారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మగ శిశువు మృతి చెందిందని వాపోయారు. వామపక్ష నేతలు కూడా ఆసుపత్రికి వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను కోరారు.



## చుక్క నీళ్లు తెచ్చిన మొఖమేనా నీది..

- కడియంపై పల్లా ఫైర్
- మా కార్యకర్తల జోలికి వస్తే ఉరుకోం..

3 లో

## సమన్వయంతో పనిచేయాలి

- ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులను గుర్తించాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



2 లో

wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించాలి
- ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా :** ప్రభుత్వ పథకాల అమలు చేయడంలో వివిధ శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. గురువారం జిల్లాలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకం, తాగునీటి సరఫరా, ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ, పింఛన్లు, కుక్క కాటు నివారణ తదితర అంశాలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, గత జనవరి 26న ఎంపిక చేసిన మోడల్ గ్రామాల్లో ఈ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లా లోని అన్ని మండలాలలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి ఈ పథకాన్ని అమలు చేయడం జరిగిందని, అలాగే ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం కేటాయించిన 3500 ఇళ్ల కోసం అర్హత కలిగిన వారినే ఎంపిక చేయాలని, జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని తేల్చి చెప్పారు. ఈ నెల 18 నుంచి 21 వరకు ఎంపీడీవోలకు చేరే దరఖాస్తుల జాబితా ప్రకారంగా లబ్ధిదారులను గుర్తించాలని, 22వ తేదీ నుంచి గుర్తించిన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి, ప్రస్తుతం వారు ఉంటున్న ఇంటిని, పైకప్పును పరిశీలించిన తర్వాతే ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ క్షేత్రస్థాయిలో సర్వే చేసి, అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. మే 2న గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అర్హుల జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. మే 3 నుంచి 5 వరకు సర్వే చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని, ఆ తదుపరి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ మేరకు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద మండల స్థాయిలో బ్యాంకర్ లతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ పథకానికి 24వ తేదీ వరకు గడువు ఉందని, ఆసక్తి గల వారు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శాశ్వత వలస పింఛన్లు, మరణించిన పింఛనుదారుల పరిశీలనను త్వరగా పూర్తిచేయాలన్నారు. సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, ఆర్డీవోలు గోపీరాం, వెంకన్న, మునిసిపల్ కమిషనర్ లు వెంకటేశ్వర్లు, రవీందర్, డీపీఓ స్వరూప, డిప్యూటీ సీఈఓ సరిత, ఎల్డీఎం శ్రీధర్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ మాధవీ లత, గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా హక్కులను పరిరక్షించాలి

**జనగామ, మన చౌరాస్తా :** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో గురువారం మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇర్రి అహల్య, ఎండి షబానా మాట్లాడారు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి గురించి స్త్రీల సమాన హక్కుల గురించి రాజ్యాంగంలో పొందుపరిచిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. జ్యోతిబా పూలే స్త్రీ విద్యావంతురాలు అయితే కుటుంబమంతా విజ్ఞానవంతులుగా మారుతారని, స్త్రీల చదువు కోసం పాఠశాలలు స్థాపించి భార్య సావిత్రిబాయి పూలేకు విద్య నేర్పించి సావిత్రిబాయి పూలే ద్వారా బాలికల విద్యకు ప్రోత్సాహం ఇచ్చారన్నారు. రాజ్యాంగంలో స్త్రీ, పురుషులకు కల్పించినప్పటికీ అసమానత్వం కొనసాగుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాడి సాధించుకున్న హక్కులు చట్టాలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, అత్యాచారాలు, కుల దురంకార హత్యలు గురించి బీజేపీ నోరు మెదపటం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా పట్టణ కమిటీ సభ్యులు ఎర్ర అనిత, బండ సౌందర్య, ఎర్ర రజిత, ఎం.జయ, కమల, లక్ష్మి, సుజాత, కోమల పాల్గొన్నారు.






## ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు

**జనగామ రూరల్, మన చౌరాస్తా:** ప్రజల దహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రజలకు సేవ చేయడమంటేనే అమరుల ఆశయాలను కొనసాగించడం అని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మరిగడి గ్రామంలోని చౌరస్తా వద్ద, ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కీ.శే కామ్రేడ్ రామావత్ బాలు నాయక్, కామ్రేడ్ రామావత్ కనకలక్ష్మి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. చల్లటి తాగునీరు ప్రజలకు అందించడం కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆలోచన వారి కుటుంబ సభ్యులు అయినా మరిగడి గ్రామ మాజీ సర్పంచ్ రామావత్ మీట్యా నాయక్, రామావత్ బిక్కు నాయక్ స్ఫూర్తి దాయకమని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బోడ నరేందర్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్యా చందు నాయక్, పుత్కనూరి ఉపేందర్, మాజీ సర్పంచ్ మీట్యా నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ, జిల్లా ఉపాధ్యక్షులు భూక్య యాకన్న రాథోడ్, సిపిఎం నాయకులు చామకూరి రాములు, బోడ రాములు, రామావత్ బిక్కు నాయక్ పాల్గొన్నారు.

## లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్‌గా తణుకు మహేష్ నియామకం



**కరీంనగర్, మన చౌరాస్తా :** కరీనంగర్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్ తణుకు మహేష్ న్యాయవాదిని డిప్యూటీ లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ గా కొండ్ర మౌనిక నియమితులయ్యారు. జిల్లా ప్రధాన న్యాయస్థానంలో ఆర్థిక స్థోమత లేని నిందితులకు వీరు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తారు. తణుకు మహేష్ న్యాయవాది రెండో సారి డిప్యూటీ లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ గా నియమితులయ్యారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు తదితరులు మహేశ్‌ను అభినందించారు.



## ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఘనంగా ఫేర్వెల్ డే

**చేర్యాల, మన చౌరాస్తా:** చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రోజున ఘనంగా ఫేర్వెల్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఆనందంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. ప్రణీత అధ్యక్షత వహించి విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు సమాజానికి అనుగుణంగా వారి యొక్క నైపుణ్యాలను పెంచుకోవాలని , ఉద్యోగ అవకాశాలు పొందాలని, విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలని, చెడు వ్యసనాల బారిన పడకుండా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## సెంట్రల్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌కు సన్మానం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ యుగంధర్ బదిలీ అయిన సందర్భంగా ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుర్రపు బాలరాజు, దత్రపు నరేష్ కుమార్ ,పెండెం నగేష్, జ్యోతి భాస్కర్, పోచంపల్లి శ్రీనివాస్, మార్క భిక్షపతి, కవిత, ఉమారాణి, ప్రమీల, లలిత, బ్యాంకు మేనేజర్ శివ శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.

Local News

# చుక్క నీరు తెచ్చిన మొఖమేనా నీది..

- 20 ఏళ్లు ఘన్‌పూర్ ప్రజలు నిన్ను తిరస్కరించారు
- గులాబీ జెండాతోనే గెలిచావ్
- మా కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోనేది లేదు..
- కడియంపై జనగామ ఎమ్మెల్యే పల్లా ఫైర్



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మరోసారి ఫైర్ అయ్యారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని అన్విక కన్వీన్షన్‌లో మాజీ ఎమ్మెల్యే రాజయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సన్నాహాక సమావేశంలో పల్లా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'నియోజకవర్గానికి చుక్క నీరు తెచ్చిన మొఖమేనా నీది..! 20 ఏళ్లు ఘన్‌పూర్ ప్రజలు నిన్ను తిరస్కరించిండ్రు.. గులాబీ జెండాతోనే గెలిచావ్.. మా కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోనేది లేదు..' అంటూ కడియంపై మండి పడ్డారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శిష్యుడు కడియం శ్రీహరి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. తెలంగాణ అంటే మా ఘన్ పూర్ గడ్డ అని 2023 ఎన్నికల్లో 12 నియోజకవర్గాల్లో ఘన్ పూర్ గడ్డ కేసిఆర్ కు అండగా నిలిచింది. గత పాలకుల హయాంలో పొలాలకు నీళ్లు వచ్చా యా..? బీఆర్ ఎస్ హయాంలో రెండు పంటలు నీళ్లు వచ్చాయి.. రోడ్లు వచ్చాయి ప్రజలందరికి తెలుసు.. నియోజకవర్గానికి 100 పడకల ఆసుపత్రి మంజూరు చేయించి జీఓ ఇస్తే ఆపింది కడియం శ్రీహరి కాదా..? కడియం రెండు సార్లు విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఒక్క డిగ్రీ కాలేజీ ఎందుకు రాలేదు..? 20 ఏళ్లుగా నువ్వు ఎమ్మెల్యేగానే లేవు..2004 నుంచి నిన్ను ఘన్ పూర్ ప్రజలు తిరస్కరించారు. నువ్వు అభివృద్ధి చేసినవ్ అని ఎందుకు అబద్దాలు మాట్లాడుతున్నావ్.. గులాబీ మాట నీ నోటా ఎత్తనంత వరకు ప్రజలు నిన్ను చిత్తుగా ఓడించిండ్రు..' అని అన్నారు. ఒక్క ఎకరానికి, ఒక్క కాలువకు, ఒక్క చెరువుకు నీళ్లు తెచ్చిన మొఖమేనా నీది అని ఎద్దేవ చేశారు. ఈ నెల 27న జరిగే సభను సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు.



# అంజయ్య సేవలు చిరస్మరనీయం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణ ప్రగతి తో పాటు ఈ ప్రాంతంలో విద్యా వ్యాప్తి కి కృషి చేసిన ప్రిన్సిపాల్ అంజయ్య సేవలు చిరస్మరనీయం అని పలువురు వక్తలు కొనియాడారు. ఈ నెల 6 న మృతి చెందిన కాసం అంజయ్య దశదిన కర్మ, సంతాప సభ గురువారం ఉదయం గాయత్రి గార్డెన్స్ ఆవరణలో జరిగింది. లయన్స్ క్లబ్ జనగామ అధ్యక్షుడు వై. సంజీవరెడ్డి అధ్యక్షత వహించగా కార్యక్రమ వ్యాఖ్యాతగా వ్యాహరించిన పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశుములు అంజయ్య జీవన ప్రస్థానం గురించి వివరించారు. జనగామ ఏ బి వి ప్రభుత్వ డిగ్రీ కళాశాల దివంగత మంత్రి వర్యులు ఎన్. యేతిరాజా రావు చైర్మన్ గా తోలుత ప్రయివేట్ గా ప్రారంభం అయి ఏయిడెడ్ కళాశాల ఆ తర్వాత ప్రభుత్వ కళాశాలగా ఎదగడంలో అంజయ్య కృషి ఉందని వక్తలు కొనియాడారు. అలాగే పట్టణ పురోభివృద్ధికి సంభందించి ప్రత్యేకించి, హిందీ శిక్షణ కళాశాల స్థాపనతో పాటు, ఏబివి ఉన్నత పాఠశాల అధ్యక్షునిగా, గ్రాందాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షునిగా, హిందీ ప్రేమి మండలి అధ్యక్షునిగా ఇంకా గీతాశ్రమం, సరస్వతి శిశు మందిర్, ఈ ప్రాంతంలో నెలకొల్పిన విద్యాశంస్థలకు తన వంతు సహాకారం అందించి ప్రోత్సహించారు. లయన్స్ సంస్థ వేదికగా అనేక సేవా కాసర్యాలకు శ్రీకారం చుట్టీ ఆ సంస్థ వ్యాప్తి విశేషంగా కృషి చేసిన అంజయ్య సేవలు చిరస్మరనీయం అని పలువురు లయన్స్ నాయకులు, తక్షణ పూర్వ మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున లింగయ్య అన్నారు. తోలుత కాకతీయ విశ్వ విద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వంగాల గోపాల్ రెడ్డి, అంజయ్య సమాకాలీకుడు విశ్రాంత ఆచార్యుడు ఎస్. ఎం. రెడ్డి, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ హనుమాండ్ల రాజీ రెడ్డి, మాజీ చైర్మన్ డా. గుర్రం శ్రీనివాస రెడ్డి అంజయ్య చిత్ర పటానికి పూల మాల సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. సభలో పాల్గొన్న బంధు మిత్రులు, లయన్స్, హిందీ ప్రేమిమండలి, ఆవోపా, వైశ్య మహాసభ నాయకులు పాల్గొని మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. విశ్రాంత లెక్చరర్ మాచర్ల రాములు మాట్లాడుతూ డిగ్రీ కళాశాల అబ్బివృద్ధికి ఎనలేని కృషి చేసినతొలి ప్రిన్సిపాల్ అంజయ్య స్మారక కళాశాల గా నామకారణం చేయాలని ప్రభుత్వాన్ని కోరాలని ప్రత్తిపాదించిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. అడ్వకెట్, హిందీ ప్రేమిమండలి ప్రస్తుత అధ్యక్షుడు వి. ప్రసాద రావు మాట్లాడుతూ సంతానలేమిని ఎన్నడూ లోటుగా భావించని అంజయ్య తన తమ్ముళ్ళని కుమారులుగా భావించి చూసుకున్న ధన్యజీవి అన్నారు. అంజయ్య సేవలను గుర్తుచేస్తూ ప్రసంగించిన వారిలో లయన్స్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి, వైస్ జిల్లా గవర్నర్ ఎలెక్ట్ పి. హరికిషన్ రెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్లు డా. డి. లవకుమార్ రెడ్డి, తమ్మీర లక్ష్మీ నరసింహా రావు, పబ్బ రవీంద్రనాథ్ గుప్తా వివిధ సంస్థల నాయకులుప్రొఫెసర్ శంకరయ్య, ప్రొఫెసర్ రమణయ్య, పజ్జూరి గోపయ్య, జయహరి, డా. జి. సీతారామ్, ప్రిన్సిపాల్ నర్సయ్య, జి. రామచంద్రం, డా. పి. నాగేశ్వరరావు, జి. ప్రమోద్ కుమార్, అల్లాడి ప్రభాకర్ రావు, జైన రమేశ్, సిహెచ్ రవీందర్ రెడ్డి, చంద్రగిరి ప్రసాద్, కృష్ణజీవన్ బజాజ్, మర్యాల అశోక్, ఆకుల సతీష్, హరిశచంద్ర ప్రసాద్, డా. సిహెచ్ రాజమౌళి, ఏ. బిక్షపతి, సిహెచ్ శ్రీనివాస్, ఆర్. రమణా రెడ్డి, కె. రాజశేఖర్ రెడ్డి, కూతటి ఉప్పలయ్య, టి. వెంకట్ నారాయణ, సిహెచ్ వెంకట రమణ రెడ్డి, రామిని శ్రీనివాసులు, దోసపాటి శ్రీనివాస్, ఖమ్మం విశ్వశ్వ్రావు, వరంగల్ పిన్నా శివకుమార్ తదితరులు ప్రశాంగించారు. కార్యక్రమంలో పాల్గొని అన్నయ్య ఆత్మ శాంతి కి, మాకు ఓదార్పు పలికిన ప్రఒక్కరికి అంజయ్య సోదరులు విజయకుమార్, రవికుమార్, వినోద్ కుమార్, కుమారుడు సుకేష్ కుమార్ లు కృతజ్ఞతలు తెలిపారు.



# మేడే ను జయప్రదం చేయండి

## సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

**చేర్యాల, మన చౌరాస్తా :** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ఉత్సవాలను మే 1వ తేదీన ఘనంగా జరుపుకోవాలని, కార్మికులు, కర్షకులు, శ్రామిక వర్గం ఈ ఉత్సవాలలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో బోయిని మల్లేశం అధ్యక్షతన చేర్యాల పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆముదాల మల్లారెడ్డి పాల్గొని మాట్లాడుతూ కార్మికులకు, కర్షకులకు ప్రపంచవ్యాప్తంగా పనిగంటల రోజుకు ఎనిమిది గంటల పనిని చేయాలని అంతకంటే ఎక్కువ చేసే ఆస్కారం లేదని పోరాటం లో విజయం సాధించుకున్న రోజు ఎర్రజెండా పుట్టినరోజు మేడే ఉత్సవాలను ఊరూరున ఘనంగా జరుపుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, పట్టణ కమిటీ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు పోలోజు శ్రీహరి, ముస్త్యాల ప్రభాకర్, ఇప్పకాయల శోభ, ఆముదాల రంజిత్ రెడ్డి, బియా సిద్దులు, కనుకయ్య, మల్లయ్య, నూర్ బి, కనకవ్వ, కనకలక్ష్మి పాల్గొన్నారు.



# చేర్యాల మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల వ్యవసాయ మార్కెట్లో వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించా లని, రైతులు పడుతున్న ఇబ్బందులను అధికారులు అర్థం చేసుకొని కాంటాలను వెంటనే ప్రారంభించి ధాన్యాన్ని గోదాములకు తరలించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో చేర్యాల వ్యవసాయ మార్కెట్ ని సందర్శించి రైతులతో మాట్లాడిన సందర్భంగా కొంగరి వెంకట మావో మాట్లాడుతూ గత 15 రోజుల నుండి వ్యవసాయ మార్కెట్లో రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్కు తెచ్చి ఆరబోసుకొని పడిగాపుల పడుతున్నారని, వెంటనే మార్కెట్ అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేపట్టాలి. వెంట వెంటనే రైస్ మిల్ గోదాములోకి ధాన్యాన్ని తరలిస్తే కొత్త రైతులు మార్కెట్లోకి వచ్చే ఆస్కారం ఉంటుందని పూర్తిస్థాయిలో మార్కెట్లో స్థలం లేకుండా ధాన్యం కుప్పలతో నిండి ఉందని మార్కెట్ అధికారులు ఇదేవిధంగా కాలయాపన చేస్తే అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్ద అయ్యే అవకాశం ఉందని ఆరుగాలం ఎండనకా వాననకా రైతులు తమ పంటలను సాగు చేసి వరి ధాన్యాన్ని మార్కెట్ కు తెస్తే అమ్మడానికి 15 రోజులు పడిగాపులు కాస్తూ ఎదురుచూస్తుండడం రైతులకు ఇబ్బందికరంగా మారిందని వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, వరి కోతల సీజన్ ప్రారంభమై 20 రోజులు అయినప్పటికీ ఇంకా మార్కెట్లో రైతులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని వెంటనే తాలు తూర్పార పట్టే మిషన్లను సరిచేసి రైతులకు అందుబాటులో ఉంచాలని టార్పాలిన్ కొట్టాలను అవసరమైన అన్ని రైతులకు ఇవ్వాలని ఈ చర్యలన్నీ అధికారులు పర్యవేక్షించే విధంగా చూడాలని లేని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రైతులను ఏకం చేసి రైతులకు జరుగుతున్న అన్యాయంపై నిలదీసే విధంగా ఉద్యమిస్తామని ఈ ఉద్యమాలకు రైతులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోయిన మల్లేశం, ముస్త్యాల ప్రభాకర్, మల్లయ్య, కనకయ్య, బుట్టి మల్లయ్య, నరసవ్వ తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారానికి...

# భూ భారతి చట్టం

## స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా : గతంలో ధరణిలో పరిష్కారం కానీ కొన్ని భూ సమస్యలను ఆర్.ఓ.ఆర్. చట్టం ద్వారా భూ భారతి లో పరిష్కరించుకోవచ్చునని స్టేషన్ ఘన్పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి తెలిపారు. గురువారం స్టేషన్ ఘన్పూర్ నియోజక వర్గం చిల్పూర్ మండల కేంద్రం లోని వరలక్ష్మి ఫంక్షన్ హాల్ లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆర్. ఓ.ఆర్.(రికార్డ్స్ ఆఫ్ రైట్స్) చట్టం భూ భారతి పై మండల రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ లతో కలిసి కడియం శ్రీహరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టంతో మండలాల్లో పరిష్కారం కానీ కొన్ని భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. అందుకే రైతులకు ప్రత్యేకంగా అవగాహన సదస్సులను ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ చట్టం కింద భూమిపై హక్కులు సంక్రమించినప్పుడు ఆ రికార్డ్ లో పేర్లు, సర్వే నెంబర్లు వంటివి తగిన ఆధారాలతో మార్పులు చేయడం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. భూ భారతిలో హక్కుల రికార్డ్ లలో తప్పుల సవరణకు అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందుగా భూముల సర్వే, మ్యాప్ తయారీ, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ తో భూ భారతిలో భద్రత ఉంటుందన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే భూ భారతి అని ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చట్టం లోని ప్రాధాన్యత వివరాలను ప్రజలకు సులువుగా అర్థమయ్యే రీతిలో కరపత్రంపై ముద్రించి విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ... సమస్యల పరిష్కారానికి ఆర్.ఓ.ఆర్. చట్టం ద్వారా భూ భారతి ని ప్రవేశ పెట్టిందన్నారు. భూ సమస్యలున్న ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు ఇక నుండి భూములకు సంబంధించిన పహాణిలను ఆన్లైన్ లోనే కాకుండా హార్డ్ కాపీలను రికార్డుల రూపంలో జాగ్రత్తగా భద్రపరుస్తామన్నారు. భూభారతి తో భూములకు ఆక్రమణలకు తావుండదని, రెవెన్యూ పరంగా పూర్తి చర్యలు తీసుకుంటూ భద్రత కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాలలో ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా భూ భారతి పై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్య, చిల్పూర్ దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.







## బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను

# వేగవంతం చేయాలి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలో గల బతుకమ్మ కుంటను కలెక్టర్ సందర్శించి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రూ. కోటి 50 లక్షలతో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ మేరకు బతుకమ్మ కుంట సుందరీకరణ నేపథ్యంలో గ్రిల్స్, కాలిబాట, గజిబోలు, లైటింగ్, వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆటస్థలం, ఆడుకునేందుకు పరికరాలు, చిన్న పార్కు ఏర్పాటుకు ప్రారంభించిన పనులను వేగవంతం చేసి, నెలరోజుల్లోగా పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే కుంట పూడికతీత పనులను కూడా త్వరగా పూర్తిచేయాలని సూచించారు. తనిఖీలో కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నీటి పారుదల శాఖ ఈఈ మంగీలాల్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** దేశంలో సన్నాలకు 500 బోనస్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండలం లక్ష్మితండా, ఇబ్రహీంపూర్ గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కడియం ప్రారంభించారు. అనంతరం ఇబ్రహీంపూర్ లో ఎంపీ నిధులతో నిర్మించిన మహిళా భవనాన్ని, లక్ష్మి తండాలో 2 కోట్ల 80 లక్షలతో నిర్మించిన బీటి రోడ్డు ను ప్రారంభించారు.

